ఓబులేసు శరీరాన్ని నేలపైకి దించిన ఏడుకొండలు, మౌనంగా ఆ శవాన్నే చూస్తుండిపోయాడు. అతను ఏడ వడం కూడా మర్చిపోయేంతగా దిగ్భ్రాంతిలో మునిగి పోయి ఉన్నాడనీ అందరూ అర్థం చేసుకున్నారు. క్షణాల్లో అక్కడ పోలీసు వ్యాను ప్రత్యక్షమైంది.

ఏమైందన్న పోలీసుల ప్రశ్నకు అతికష్టంమీద..

''సముద్దరంలో సరదాగా శికారు సేద్దామని మా ఓబులేసు అడిగితే కాదనలేక పడవ తీసినాను సారూ! కాసింత లోపలికెల్లినంక ఒక పెద్ద అల వొచ్చి మా పడ వను ఎంత గట్టిగా తాకిందంటే.. ఆ దెబ్బకు అది గింగ రాలు తిరుగుతూ పైకి ఎగిరింది. మేము దాన్లోంచి నీళ్లల్లో పడిపోయినం. కానీ, దురదుట్టం ఏటంటే.. ఆ పైకెగిరిన పడవ సరిగ్గా వొచ్చి మా వోడి తలమీద పడినాది. దాంతో ఆడి తల పగిలినాది. ఎంటనే ఈడ్ని ఒడ్డుకు తెచ్చేసినా. కానీ, అప్పటికే రక్తం శానా కారిపోయినాది. ఒడ్డుకు తెచ్చేలోపల ఆడు..'' ఇక ఏడుకొండలు నోట మాట పెగల్లేదు.

ఇంకా పెళ్లికూడా కాని ఓబులేసు, అలా పుట్టిన ఊరి లోనే మట్టిలో కలిసిపోవడం అందరినీ ఎంతగానో కద లించింది. అతని అంత్యక్రియలు ఏడుకొండలు చేతుల మీదుగానే జరిగాయి.

అందరూ శ్మశానాన్ని విడిచిపోతున్నా ఏడుకొండలు మాత్రం అక్కడే స్నేహితుని చితికి కాస్త దూరంలో కూల బడి ఉండటం చూసి, అందరి మనసులూ ద్రవించాయి. తన ప్రాణాన్ని రక్షించిన ఓబులేసు, తన కళ్లముందే చని పోవడం చూసిన అతను.. దిగ్భ్రాంతికి గురయ్యాడని అక్కడ అందరికీ అర్థమైంది. అతణ్ని ఓదార్చడం అక్కడ ఎవ్వరి తరమూ కాలేదు.

''ఇక గూడేనికి పోదాం రా!'' అంటూ ఎవరెంత బతి మిలాడినా అతను అక్కణ్నుంచి కదలలేదు. అతని వ్యధ అంత తేలిగ్గా తీరేది కాదనుకుంటూ ఒక్కొక్కరూ అక్క ణ్నుంచి వెళ్లిపోయారు.

''మనం ఎంత బాధపడినా పోయినోడు తిరిగొత్తాడా సెప్పు. పొద్దుగాలనుంచి పిల్లలు బువ్వకూడా సరిగ్గా తిన లేదు. నేనింటికెల్తన్నా. నువ్వూ సీకటడకముందే వచ్చేయ్'' అని చెప్పి.. అతని భార్య కూడా వెళ్లిపో యింది.

అక్కడ అతను ఒంటరిగా మిగిలిపోయాడు. జరిగిం దంతా అతనికి ఒక కలలాగా అనిపించసాగింది. ఒకసారి అది మొత్తం అతని కళ్లముందు గిర్రున తిరిగింది.

* * *

ఓబులేసును పడవ ఎక్కించుకుని కొంతదూరం పోయాక..

''ఇప్పుడు సెప్పు. ఇంకేటి సంగతులు!'' అని అడిగాడు ఏడుకొండలు.

''మన బెస్త గూడేలన్నిటికీ నువ్వే నాయకుడివి కాబట్టి నువ్వో పనిచేయాలి. అది చెబుదామనే నిన్నింత దూరం తెచ్చింది'' అన్నాడు ఓబులేసు.

''సెప్పు. నీకోసం ఏటైనా సేస్తా!'' అన్నాడు ఏడుకొండలు.

''చెప్తాను. నేనీ ఊర్లో ఒక ఫైవ్‌స్టార్ హోటల్లో దిగాను. అసలు నిన్నే అక్కడికి పిలుద్దామని అనుకున్నాను. కానీ గోడలకు చెవులుంటాయి. మా బిజినెస్‌లో ఎవ్వడినీ నమ్మకూడదు. కానీ, నువ్వు నా ప్రాణస్నేహితుడివి. అందుకే నిన్ను నమ్మాను. నా బిజినెస్ పార్ట్‌నర్‌గా చేయి కలుపుతానని మాటివ్వు'' అన్నాడు ఓబులేసు.

''నువ్వేటి సెబుతున్నావో నాకొక్క ముక్కగూడా అర్థం కాలేదు!''.

''అక్కడికే వస్తున్నా. నేను ముంబయిలో చేసే బిజినెస్‌కు కావాల్సింది అమ్మాయిలు..'' అని ఒక్క క్షణం ఆగాడు ఓబులేసు.

''అంటే.. అమ్మాయిలకు ఉజ్జోగాలు ఇచ్చే బిగి నెస్సా?'' అనడిగాడు ఏడుకొండలు.. పడవ తెడ్డు వేస్తూ.

''ఓరి వెర్రి మొఖమా! నేను చెప్పేది పూర్తిగా విను. అరబ్బు దేశాల్లో మనదేశం అమ్మాయిలకు చాలా డిమాం డుంది. డబ్బు ఆశ ఉన్నవాళ్లనూ, పేదవాళ్లనూ నేను ఎర వేసి పట్టుకుని, వాళ్లకు అరబ్బు దేశాల్లో ఉద్యోగాలు ఇప్పి స్తానని చెప్పి తీసికెళ్లి.. అక్కడ షేకులకు అమ్మేస్తుం టాను'' అంటూ చెప్పాడు ఓబులేసు.

ఆ మాట వినగానే ఏడుకొండలు నిశ్చేష్టుడయ్యాడు.

''గదేం బిగినెస్? పాపం కాదా?'' అనడిగాడు.

''పాపం – పుణ్యం అంతా ట్రాష్. డబ్బు ఒక్కటే నిజం. ఇక్కడ మన వాళ్లందరికీ నువ్వే లీడర్‌వు కాబట్టి.. ఇక్కడున్న మన కులపోళ్లలో మంచి వయసులో ఉన్న అమ్మాయిల్ని మెల్లిగా మాయమాటలు చెప్పి, ముంబ యిలో నా దగ్గరికి పంపించు. కొద్దిరోజుల్లో నాలాగే నువ్వూ లక్షాధికారివై పోతావు!''.

''సీ.. సీ.. అంత నీతిమాలిన పని నేను జేస్తానని ఎట్టా అనుకున్నావు రా?''.. ఛీత్కారంగా అన్నాడు ఏడుకొండలు.

అప్పటిదాకా ఎంతో గౌరవంగా మాట్లాడిన మిత్రుడు.. ఒక్కసారిగా ఏకవచనంలోకి దిగడం ఓబు లేసు గమనించాడు. అయినా దాన్ని పట్టించుకోకుండా..

''ఇంకా ఈ నీతీ నిజాయితీ ఏంట్రా? చిన్నప్పటి నుంచీ నువ్వీ గర్భదరిద్రంలో మగ్గుతున్నావు. నిన్నెవ రైనా కాపాడారా? నువ్వు నా ప్రాణ స్నేహితుడివి కాబట్టి నీకు లక్షలు సంపాదించే మార్గం చూపిస్తున్నాను. నువ్వూ నా దారిలోకి రా. కొద్దిరోజుల్లోనే నీ దశ తిరిగిపో తుంది'' ఆశపెట్టాడు ఓబులేసు.

''వొద్దురా! ఈ దరిద్రపు పని నేను సెయ్యను. నువ్వు గూడా దీన్ని ఇక ఆపేసి ఇక్కడే నాతో ఉండిపో! నియ్య తిగా మనకొచ్చింది తిని బతుకుదాం'' స్పష్టంగా చెప్పాడు ఏడుకొండలు

''ఏంటీ.. వ్యాపారం ఆపెయ్యాలా? ఇక్కడే ఉండిపో వాలా? ఎంత తేలిగ్గా చెప్పావురా. ఇప్పుడు నేను ముంబయ వెళ్లకపోతే ఎన్ని డీల్స్ ఆగిపోతయో.. నాకెన్ని లక్షల నష్టం వస్తుందో తెలుసా? ఇక్కడ నువ్వు కాకపోతే ఇంకొకడు సహాయం చేస్తాడు. నాకు బోడి సలహాలు ఇవ్వడం మాని.. నాతో చెయ్యి కలుపుతావో లేదో చెప్పు'' నిష్కర్షగా అడిగాడు ఓబులేసు.

''నేను నీతో సెయ్యి కలపను. ఇంకోన్ని కలపని వ్వను''.. అంతకంటే నిష్కర్షగా అన్నాడు ఏడుకొండలు.

అంతే.. ఒక్కసారిగా అక్కడి వాతావరణంలో మార్పు వచ్చేసింది. గాలి గంభీరమైపోయింది. ఓబులేసు పడ వలో లేచి నిలబడి..

''కలపనివ్వనంటే.. ఏం చేస్తావు? అసలు నువ్వేం చేయగలవు? ఆఫ్టరాల్ ఒక అర్భక జాలరిగాడివి. నేను పెట్టిన ప్రాణభిక్షతో బతుకుతున్నవాడివి. నాకు నువ్వు పనికి వస్తావని ఇక్కడికి వచ్చానే గానీ, నీ మీద ప్రేమతో రాలేదు. నేనెంత కర్కోటకుడినో నీకు తెలీదు. నాలో జాలి – దయ అన్నవి ఏ కోశానా లేవు. నేను తలచు కుంటే నిన్నిక్కడే ఇప్పుడే జలసమాధి చేసి వెళ్లిపోగలను'' అన్నాడు కర్కశంగా.

అది విని ఏడుకొండలు..

''అబం సుబం తెలీని ఆడబిడ్డల ఉసురు పోసుకుంటు న్నావని తెలిసినప్పుడే నువ్వెట్టాంటోనివో నాకు అర్థ మైంది. ఒకప్పుడు నువ్వు నాకు పేణబిచ్చ పెట్టింది నిజమే గావొచ్చు. అంతమాత్తరాన నువ్ సెప్పే నీతిమా లిన పని సేస్తానని ఎట్టా అనుకున్నావు? నేను ఒక నాయ కున్నే కాదు, మానవత్వం ఉన్న మడిసిని కూడా! అందుకే ఎంతోమంది ఆడబిడ్డల్ని రచ్చించడం కోసం ఉప్పుడు నేనీ పని సెయ్యక తప్పడంలేదు. ఎందుకంటే నీలాంటోడు బతికుంటే ఇంకెంతమంది ఆడబిడ్డల బతు కులు బుగ్గిపాలు అవుతయో తెల్వదు'' అంటూ..

అదాటున పోటెత్తిన అలలా లేచి, తన చేతిలో ఉన్న పడవ తెడ్డుతో ఓబులేసు తలపైన బలంగా ఓ దెబ్బ వేశాడు.

ఒకే ఒక దెబ్బ. అంతే.. దాంతో ఓబులేసు తల రెండుగా విచ్చుకుంది.

''అబ్బా..'' అని పెద్దగా ఆర్తనాదం చేస్తూ అతను పడవలోంచి నీళ్లలోకి జారిపోయాడు.

''నేను సేసిన ఈ పని ఏమాత్తరం తప్పుగాదని నాకు దెల్సు. ఒకేల తప్పయినా.. ఆ దేవుడు నన్ను తప్పకుండా సెమిస్తాడు!'' అంటూ ఏడుకొండలు నీళ్ల లోకి దూకి, ఓబులేసు శరీరాన్ని పడవలోకి ఎక్కించి, తీరానికి చేర్చాడు.

ఆ ఓబులేసే ఒకప్పుడు ఏడుకొండలుకు ప్రాణభిక్ష పెట్టాడన్న సంగతి పోలీసువాళ్లకు గూడెంవాళ్లు చెప్పారు. అందుకే జరిగిందంతా దాచి, కొత్తగా కట్టుకథ అల్లి చెప్పిన ఏడుకొండలు మాటలను పోలీసులు కూడా విశ్వసించారు. వాళ్లకు అతనిపైన అణుమాత్రం అనుమానమైనా రాలేదు.

జరిగిందంతా గుర్తుకు రావడంతో ఏడుకొండలు గాఢంగా నిట్టూర్చాడు.

వెనుకనున్న సముద్రం మాత్రం అసలు అక్కడ ఏమీ జరగనట్లు, తానేమీ చూడనట్లు ప్రశాంతంగా ఉంది. ■

## గండ్రకోట సూర్యనారాయణ శర్మ



'సంపాదన కన్నా.. నమ్ముకున్న విలువలే మిన్న!' అని నమ్మిన ఓ నిరుపేద జాలరి కథ 'పోటెత్తిన అల'. రచయిత గండ్రకోట సూర్యనారాయణ శర్మ. 'సూర్య గండ్రకోట' పేరుతో రచనలు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని తెనాలిలో పుట్టిపెరిగారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ (తెలుగు సాహిత్యం) చది వారు. తెలంగాణ స్టేట్ కో–ఆపరేటివ్ బ్యాంక్‌లో ఏజీఎంగా పనిచేసి, పదవీ విరమణ పొందారు. వివిధ ప్రక్రియల్లో రచనా వ్యాసంగాన్ని ప్రవృత్తిగా ఎంచుకున్నారు. ఈయన రాసిన కథల్లో 80 వరకు కథలు ప్రచురితమయ్యాయి. పాతిక పైగా కథలు వివిధ పోటీల్లో బహుమతులు గెలుచు కున్నాయి. ముప్ఫై వరకు కవితలు, గజల్స్ వివిధ పత్రికలలో అచ్చయ్యాయి. ఆనంద హేల, కలలు కౌముది, జాబిల్లి కోసం ఆకాశమల్లే నవలలు రాశారు. 'అసుర మేధం' 24 వారాల సీరియల్‌గా ప్రచురితమైంది. 'ఆనంద హేల' నవల పుస్తకరూపంలో విడుదలైంది. నమస్తే తెలంగాణ – ముల్కనూరు సాహితీ పీఠం నిర్వహించే కథల పోటీలో బహుమతి గెలుపొందడం ఇది రెండవసారి.